సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

గురువారం । 19 । జనవరి । 2023



ప్రాణం తీసిన అతివేగం

ఓబులవారిపల్లె మండలంలో చెట్టును కారు ఢీకొనడంతో దినేష్ కుమార్‌రెడ్డి, తేజేశ్వరరెడ్డి అనే యువకులు మృతి చెందారు. -8లో..



ముగిసిన స్టాఫ్‌నర్స్ నియామకాల కౌన్సెలింగ్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామక కౌన్సెలింగ్ ముగిసింది. -8లో..

గరిష్ఠం/కనిష్ఠం
30.7/15.5

వాతావరణం

జిల్లాలో గురువారం 15.5 – 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కడప ఎయిర్‌పోర్టు అసిస్టెంట్ కమాండెంట్ సస్పెన్షన్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప విమానాశ్రయం అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప ఎయిర్‌పోర్టు ప్రహరీ గోడకు ఫెన్సింగ్ అమర్చడంలో, విమానాశ్రయం లోపల, వెలుపల కుప్పలుగా పేరుకుపోయిన మట్టి దిబ్బలను తొలగించడంలో విఫలమైనందున.. అలాగే ఈ నెల 10వ తేదీన పగటిపూట విమానాశ్రయంలోకి ఓ పోరుడు చొరబడినందున శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు.

సంక్రాంతి ఆదాయం రూ.1.58 కోట్లు



కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతిని పురస్కరించుకుని ఈనెల 9వ తేది నుంచి 14వ తేది వరకు కడపజోన్ పరిధిలోని కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి రీజియన్ల పరిధిలో 625 ప్రత్యేక సర్వీసులు నడపగా, వాటి ద్వారా రూ. 1,58,25,871 ఆదాయం వచ్చిందని కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రీజియన్ పరిధిలో 55 బస్సులు, చిత్తూరు 24, అన్నమయ్య 77, వైఎస్సార్ 201, నంద్యాల 74, కర్నూలు 67, అనంతపురం 72, సత్యసాయి పరిధిలో 55 బస్సుల చొప్పున నడిపామన్నారు. 56,625 మంది ప్రయాణీకులను తమ తమ గమ్యస్థానాలకు చేర్చామని వివరించారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతి, కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపామన్నారు. ఈ సందర్భంగా సహకరించిన ఆర్ఎంలు, డీఎంలు, సీఐలు, ఇతర సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు.

- జిల్లాలో ముమ్మరంగా ఈ క్రాప్ నమోదు
- పొలం వద్దనే రైతుల నుంచి సమాచార సేకరణ
- పంటలన్నింటికీ ఈ క్రాప్ తప్పనిసరి అంటున్న అధికారులు



కమలాపురం ప్రాంతంలో ఈ క్రాపు నమోదు చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్



ఈ క్రాప్‌తో రైతన్నలకు భరోసా

ఇప్పటి వరకు ఈ క్రాప్ నమోదైన పంటల వివరాలు: 2,21,015 ఎకరాలు | ఇప్పటి వరకు ఈ క్రాప్ నమోదు శాతం : 76.66 శాతం

కడప అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి విశేష సేవలను అందిస్తున్నారు. పంటలను సకాలంలో సాగు చేసుకునేందుకు వీలుగా పెట్టుబడి కింద రైతు భరోసా సాయం వారి ఖాతాల్లో జమచేస్తోంది. విత్తనం మొదలుకుని పంట దిగుబడి చేతికొచ్చే వరకు అన్ని రకాల సేవలందిస్తోంది. పంట దిగుబడులకు మద్దతు ధరను కల్పించి పంట కొనుగోలు చేసి వారికి అండగా నిలుస్తోంది. దీంతోపాటు విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ఈ క్రాప్ నమోదు చేస్తోంది.

● ప్రస్తుత రబీసీజన్‌లో రైతన్నలు ఏఏ పంటలను సాగు చేశారు. ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిసెంట్స్ నేరుగా పొలాల వద్దకు వెళ్లి పారదర్శకంగా ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు.

జిల్లాలో రబీలో సాగైన పంటల వివరాలు ఇలా...

జిల్లాలో 36 మండలాల పరిధిలో 432 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,50,812 హెక్టార్లలో సాధారణ వ్యవసాయ సాగు భూమి ఉంది. ఇందులో ఈ రబీ సీజన్‌కు ఇప్పటి వరకు 1,00,167 హెక్టార్లలో వివిధ పంటలను సాగుచేశారు. ఇందులో 71,824 హెక్టార్లలో శనగ సాగుకాగా, 2500 హెక్టార్లలో వరి , 3261 హెక్టార్లలో జొన్న , 1013 హెక్టార్లలో మొక్కజొన్న, 763 హెక్టార్లలో సజ్జ , 11473 హెక్టార్లలో మినుము, 1369 హెక్టార్లలో పెసలు, 3495 హెక్టార్లలో వేరుశనగ, 1086 హెక్టార్లలో నువ్వులు, 1419 హెక్టార్లలో సన్‌ఫ్లవర్ , 808 హెక్టార్లలో కుసుమ , 819 హెక్టార్లలో పత్తి సాగయ్యాయి. వీటితోపాటు ఇంకా పలు రకాల పంటలు కలుపుకుని 1,00,167 హెక్టార్లలో సాగయ్యాయి. వీటిలో ఏఏ పంటలు ఎంతమేర సాగయ్యాయనే వివరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్‌లు నేరుగా రైతుల పొలం వద్దకే వెళ్లి ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు.

ముమ్మరంగా నమోదు ప్రక్రియ...

జిల్లాలో ప్రస్తుతం ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2,40,445 ఎకరాల సాగుకు గాను ఇప్పటి వరకు 2,21,015 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు పూర్తి చేశారు. ఈ క్రాప్ నమోదు కోసం రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్లు భూమికి సంబంధించిన వివరాలు ఇస్తే వీఏఏలు ఆధార్ బేస్ డేటాను అనుసంధానం చేసి ఈ క్రాప్ నమోదు చేస్తారు. ఈ ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది.

ప్రయోజనాలు..

ఈ క్రాప్ నమోదు వల్ల వరదలు, తుఫాన్‌ల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. అంతేకాక పంటల బీమా కావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవాలన్నా ఈ క్రాప్‌లో నమోదు తప్పని సరి. పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ క్రాప్ చేసి ఉండాలి.

ఫిబ్రవరి 15వ తేదీ వరకు గడువు



రబీలో పంటలు సాగుచేసిన రైతులందరూ ఈ క్రాప్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలి. ఇందుకు సంబంధించిన గడువు ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఉంది. ఇంకా ఈ క్రాప్ నమోదు చేసుకోని రైతులు ఉంటే తప్పని సరిగా నమోదు చేయించుకోవాలి. అలసత్వం చేస్తే గడువు ముగుస్తుంది. ప్రతి రైతు గమనించుకోవాలి. – అయినా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి. వైఎస్సార్‌జిల్లా

జిల్లాలో రబీ సీజన్‌లో సాగైన పంటల వివరాలు హెక్టార్లలో...

జిల్లాలో వ్యవసాయ సాధారణ పంటల సాగు విస్తీర్ణం:	1,50,812
ఇప్పటి వరకు సాగైన పంటల వివరాలు:	1,00,167
సాగైన వరిపంట:	2500
శనగ :	71,824
మినుము :	11,473
జొన్న :	3261
మొక్కజొన్న:	1013
పెసర :	1369
వేరుశనగ :	3495

21న ‘అష్క్’ పుస్తకావిష్కరణ సభ



కడప కల్చరల్ : యువ కథా రచయిత కడపకు చెందిన షేక్ షబ్బీర్ హుసేన్ రచించిన ‘అష్క్’ కథల సంపుటిని శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాష ముఖ్య అతిథిగా హాజరవుతారని, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ కథకులు షేక్ హుసేన్ సత్యాగ్ని విశిష్ట అతిథులుగా, మానస గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎండీ లయన్ కె.చిన్నపరెడ్డి గౌరవ అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రముఖ కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ రెడ్డి, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరవుతారన్నారు. యువ సాహిత్య పరిశోధకులు డాక్టర్ తవ్వా వెంకటయ్య కథల సంపుటిని సమీక్షించనున్నట్లు ఆయన వివరించారు.

కబడ్డీ ఎంపికల వేదిక మార్పు



కడప స్పోర్ట్స్: కడప నగరంలో ఈనెల 20వ తేదీ నిర్వహించనున్న జిల్లాస్థాయి కబడ్డీ సీనియర్ విభాగం ఎంపికల వేదికను మార్పుచేసినట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్దన్‌రెడ్డి తెలిపారు. తొలుత కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో పేర్కొన్నామని, అక్కడి నుంచి కడప ఐటీఐ సమీపంలోని చెమ్ముమియాపేటలోని బసవతారకం లా కళాశాల ఆవరణంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 9949851059 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి

ఆర్జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని డీఈఓ, డిప్యూటీ ఈఓల సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలకు, మాకు ఎలాంటి సంబంధం లేదని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, పాఠశాల విద్య ఆర్జేడీ(ఎఫ్ఏసీ) బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ‘నా భార్య ఎమ్మెల్సీ అయినంత మాత్రాన నేను ఎన్నికల్లో ఏదో చేస్తానని, అందుకోసమే నన్ను ఇక్కడికి పంపారని కొన్ని పత్రికలు, కొంతమంది వ్యక్తులు ఆరోపిస్తున్నారు.. ఇందులో ఎంతమాత్రం నిజం లేదు. గతంలో రాష్ట్రస్థాయిలో పనిచేసే అధికారులను కూడా ఆర్జేడీగా నియమించారు. రాజకీయాలకు మాకు ఎలాంటి సంబంధం లేదు. ఎన్నికలను విద్యాశాఖ నిర్వహించదని.. దానికి ప్రత్యేకంగా ఎన్నికల కమిషన్ ఉంటుంది’ అని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు ఒత్తిళ్లకు, డబ్బులకు లొంగరన్నారు. ఓట్లను రహస్య బాలెట్ పద్ధతిలో వేస్తారన్నారు. భార్యలు రాజకీయాల్లో ఉంటే ఉద్యోగాలు చేసే భర్తలు ఎంతో మంది ఉన్నారని గుర్తు చేశారు. రాజకీయాలకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. విద్యాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేస్తారు తప్ప వేరేది లేదన్నారు. రాష్ట్రంలో ఇక్కడొక్కచోటే ఎన్నికలు జరగలేదని, ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా 9 చోట్ల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. తనను చూసి ఎవరూ ఓట్లు వేయరని, ఓటు అనేది వారి వ్యక్తిగత విషయం అన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అధిక ఉత్తీర్ణతశాతం సాధించేందుకు అందరి సమన్వయంతో కృషి చేస్తామన్నారు. పది విద్యార్థుల కోసం హెచ్ఎంలు నైట్ విజన్‌ను చేపట్టాలన్నారు. ఇది స్వచ్ఛందం మాత్రమేనన్నారు.

31లోపు టీచర్ల సర్దుబాటు పూర్తి చేయాలి

జిల్లావ్యాప్తంగా ఉన్న హైస్కూల్స్ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బండ్లపల్లె ప్రతాప్ రెడ్డి సూచించారు. బుధవారం కడపలోని మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఏ హైస్కూల్లో కూడా సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ సబ్జెక్టు ఉపాధ్యాయులంతా మెరుగైన బోధనతో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కడప ఎంఈఓ పాలెం నారాయణతోపాటు పలు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయాలి

పరిశోధన కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ట్రెయినీ కలెక్టర్

కడప అగ్రికల్చర్: రైతుల శ్రేయస్సుకోసం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఆయన, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం, కేవీకే, ఏరువాక కేంద్ర ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా సాగులో ఉన్న వరి, వేరుశనగ, కంది, సజ్జ, మినుము తదితర పంటలను పరిశీలించారు. అలాగే జీవన ఎరువుల కేంద్రం, భూసార పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్‌ఆచారి, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్‌లు వీరయ్య, మురళీకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు జాన్సన్, సునీల్ కుమార్, భగవతి ప్రియ, మహేష్, రామలక్ష్మి, ప్రత్యూష, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

సిద్దవటం: రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకుంటే సంబంధిత సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ విజయరామరాజు హెచ్చరించారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె సచివాలయంను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ల సేవలను పెంచాలని, మహిళా పోలీసులు తమ వద్దకు వచ్చే సమస్యలు, కేసుల వివరాలను ప్రతి రోజు రికార్డులో నమోదు చేయాలని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, తహసీల్దారు శంకర్‌రావు, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ పరిశీలన

సిద్దవటంలో రైతు చెన్నారెడ్డి నిర్మించిన పట్టుపురుగుల పరిశ్రమను, మల్బరీ పంటను బుధవారం కలెక్టర్ విజయరామరాజు, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు చెన్నారెడ్డిని పట్టు పరిశ్రమ స్థాపించడానికి కారణాలు, ఎవరు ప్రోత్సహించారు.. పట్టు పరిశ్రమ వల్ల కలిగే కష్ట, నష్టాలు, ప్రయోజనాలు, ఎంత ఖర్చు పెట్టారు, ఎంత ఆదాయం వస్తుంది తదితర వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. జిల్లా పట్టుపరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రైతు చెన్నారెడ్డి మూడు ఎకరాల్లో మల్బరీ పంట, పట్టు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి రూ.5.50 లక్షలు అంచనా తయారు చేశామన్నారు. 75 శాతం సబ్సిడీకి గాను ప్రభుత్వం రూ. 4,16,250 మంజూరు చేసిందన్నారు. సబ్సిడీ పోను మిగతాది రైతు పెట్టుబడి పెట్టారన్నారు. మండలంలో ఎవరైనా పట్టు పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకుంటే మమ్మల్ని సంప్రదించాలని ఆయన అన్నారు. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, పట్టు పరిశ్రమల శాఖ అసిస్టెంటు అధికారి నాగేశ్వర్ రెడ్డి, ఎస్ఓ రామశివదీక్షత్, తహసీల్దారు శంకర్ రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ , వ్యవసాయాధికారి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



సిద్దవటంలో పట్టు పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

కడప సిటీ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాతా శిశు మరణాలు, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక నిరోధక చట్టం, ఫోక్సో చట్టం, గృహ హింస చట్టంపై ఓఎస్డీ రఘునాథ్‌తో కలిసి చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండలాల చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి

జగనన్న హౌసింగ్ కాలనీలో లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జేసీ సాయికాంత్‌వర్మ, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, కలెక్టరేట్ ఓఎస్డీ రఘునాథ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీలో గృహ నిర్మాణాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేశు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుల నివారణపై అవగాహన

డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి



కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ విపత్తుల నియంత్రణ సంస్థ పరిధిలో పనిచేసే ఆపద మిత్రులకు గురువారం నుంచి శిక్షణ ఇస్తున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ మన్నూరు సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల నివారణపై ఆపద మిత్రులకు రెండు విడతలుగా శిక్షణ ఇస్తామన్నారు. మొదటి విడత కింద కడప, సీకే దిన్నె, పెండ్లిమర్రి, ఎర్రగుంట్ల, కమలాపురం, వల్లూరు, చెన్నూరు, ఖాజీపేట, సిద్దవటం, ఒంటిమిట్ట, అట్లూరు మండలాల్లో పనిచేసే ఆశా వర్కర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్వైకే వలంటీర్లతోపాటు గైడ్స్ వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనెల 19 నుంచి 30 వరకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఏపీ విపత్తుల నియంత్రణ సంస్థ, రూరల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయన్నారు. విపత్తులను ఎదుర్కొని ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడాలన్న అంశాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని తెలిపారు.

యోగి వేమనా.. నీకు వందనం

యోగివేమనా.. నీకు వందనం.. విశ్వకవి తాత్వికా నీకు వందనం.. అన్న ఉద్దీపన గీతంతో ఉత్తేజితులవుతూ.. సామాజిక స్పృహ కల్పించిన ప్రజాకవి పేరుతో ఏర్పాటైన యోగివేమన విశ్వవిద్యాలయంలో ఇప్పటి వరకు ఆయన జయంతి వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం వేమన జయంతిని ప్రతియేటా జనవరి 19న రాష్ట్ర వేడుకగా నిర్వహించాలంటూ ఉత్తర్వులు జారీచేసి సముచిత గౌరవం కల్పించింది.

- నేడు వేమన జయంతి వేడుకలు
- వేమన చైతన్యయాత్ర, నాటకం ప్రదర్శన

వైవీయూ: విశ్వదాభిరామ.. వినురవేమ.. అనేమాట విననని తెలుగువారు ఉండరు.. ‘‘వానకు తడవని వారు, ఒక వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరు’’ అని లోకోక్తి. ఆ మహాకవికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించింది. యోగివేమన జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రతి సంవత్సరం జనవరి 19న అధికారికంగా నిర్వహించాలని గతనెలలో జీఓ నెంబర్ 164ను విడుదల చేసింది. దీంతో ప్రతియేటా జనవరి 19న వేమన జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు మార్గం సుగమమైంది.

● ప్రజాకవి, తాత్వికవేత్త అయిన వేమన పేరుతో దేశంలో ఏర్పాటైన ఏకైక విశ్వవిద్యాలయం యోగివేమన విశ్వవిద్యాలయం. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చేతుల మీదుగా ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయంలో 2014లో వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి యేటా జనవరి 18వ తేదీన వేమన జయంతి వేడుకలు నిర్వహిస్తూ వచ్చారు. వేమన జయంతి జనవరి 18 అనేందుకు చారిత్రక ఆధారాలు ఎక్కడా లేకపోవడంతో సాహితీవేత్తలు, చరిత్రకారుల అభిప్రాయాల మేరకు అప్పటి వీసీ ఆచార్య మునగల సూర్యకళావతి ఆదేశాల మేరకు గత రెండు సంవత్సరాలుగా వైవీయూలో జనవరి 19న నిర్వహిస్తూ వచ్చారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు జనవరి 19న రాష్ట్రవేడుకగా నిర్వహించేందుకు విశ్వవిద్యాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



వైవీయూలోని వేమన విగ్రహం

నేడు వైవీయూలో..

యోగివేమన విశ్వవిద్యాలయంలో గురువారం వేమన జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి, సభాధ్యక్షులుగా వైస్ చాన్సలర్ ఆచార్య రంగ జనార్దన, ప్రత్యేక ఆహ్వానితులుగా రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రధానవక్తగా మైసూరులోని కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం పీఠాధిపతి ఆచార్య ఎం. రామనాథం నాయుడు హాజరై కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు చేతుల మీదుగా వేమన విగ్రహానికి పుష్పమాలలతో అలంకరణ, వేమన చైతన్య యాత్ర, వేమన నాటికప్రదర్శన, పద్యగానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ప్రాంగణంలో వేమన పద్యాలు..

వేమన పద్యాలు ఎంత సరళంగా స్పష్టంగా, అర్థవంతంగా ఉంటాయో.. ఆ పద్యాలకు ఉన్న ఆదరణే తెలియజేస్తుంది. అయితే వేమన పేరుతో ఏర్పాటైన విశ్వవిద్యాలయంలో ఆయన నోటి నుంచి జాలువారిన పద్యాలను ఎంపిక చేసుకుని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయంలో ‘వేమన మాట’ పేరుతో వేమన పద్యాలను రాసి క్యాంపస్‌లో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

కిసాన్ మేళాను విజయవంతం చేయాలి

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్‌జిల్లా ఊటుకూరులో వ్యవసాయ పరిశోధనస్థానం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న కిసాన్ మేళాను విజయవంతం చేయాలని తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిసాన్ మేళాలో భాగంగా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రూపొందించిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై, వివిధ పంటల్లో నాణ్యమైన, కొత్త రకాల విత్తనాలు, జీవన ఎరువులు, నమూనా పంటలు, ఇతర సమాచార పుస్తకాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అలాగే శాస్త్రవేత్తలతో చర్చాగోష్టి ద్వారా పంటల సాగులో ఎదురయ్యే సమస్యలకు రైతులు సూచనలు పొందొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ప్రభుత్వ ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి విచ్చేస్తారని తెలిపారు. వీరితోపాటు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, పశుసంవర్ధశాక జిల్లా అధికారులు, వ్యవసాయ పరిశోధనస్థానం,కృషి విజ్ఞానకేంద్రం, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు.

ఆంధ్రా అండర్-14 జట్టులో జిల్లా క్రీడాకారులు





ఎన్. విష్ణుసాయి, గౌస్‌గారి గైబు, శ్రీసాయిచరణ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : అంతర్ రాష్ట్రాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రా అండర్-14 జట్టులోని జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఈనెల 23 నుంచి కేరళ రాష్ట్రంలో నిర్వహించే అంతర్ రాష్ట్రాల పోటీల్లో జిల్లాకు చెందిన ఎన్. విష్ణు సాయి (వికెట్‌కీపర్), గౌస్‌గారి గైబు, ఎ. శ్రీసాయిచరణ్‌రెడ్డి (మీడియం పేస్ బౌలర్లు)ను ఎంపికచేశారు. జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులకు రాష్ట్ర జట్టులో అవకాశం లభించడం పట్ల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. చక్కటి ప్రతిభ కనబరిచి మరిన్ని మంచి అవకాశాలు దక్కించుకోవాలని ఆకాంక్షించారు.

కార్గో ఆదాయం అదుర్స్



- ప్రైవేటు లాజిస్టిక్‌తో ఒప్పందాలు
- సరుకు రవాణాలో జోన్–4 జోరు
- గతేడాది కంటే రూ. 10 కోట్లు పెరిగిన ఆదాయం



కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని కార్గో కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్గో సరుకు రవాణాలో ఆర్టీసీ ఊహించిన దానికంటే అధిక ఆదాయాన్ని ఆర్జిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సేవలను మరింత విస్తృతం చేసే దిశగా ఆర్టీసీ అధికారులు ఆలోచిస్తున్నారు. సరుకు రవాణాలో కడప జోన్ పరిధిలో కడప, అన్నమయ్య, అనంతపురం,సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల పరిధిలో 42 సరుకు రవాణా వాహనాలు ఉన్నాయి. వాటిలో 35 కంటైనర్లు, 7 డీజీటీలు ఉన్నాయి.ఇవన్నీ ఒక్కరోజు కూడా ఖాళీ లేకుండా ఆయా ప్రాంతాలకు సరుకులు తీసుకెళుతున్నాయి. ఇలా రోజురోజుకు పెరుగుతున్న కార్గో రవాణాతో వీటి సంఖ్యను పెంచేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు కొత్తగా ప్రైవేటు లాజిస్టిక్ (పార్శల్) సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు అధీకృత ఏజెన్సీలను ఇస్తారు. ఆపై ఆ సంస్థలు బుక్ చేసిన సరుకులను కానీ లేదా ఆ సంస్థలు రవాణా చేయగా మిగిలిన సరుకులను ఆర్టీసీ ద్వారా రవాణా చేసేలా చర్చిస్తున్నారు.

ఆర్టీసీ అధికారులు కార్గో ద్వారా ఇంకా ఆదాయాన్ని పొందేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రైవేట పార్శిల్ సర్వీసులు సరుకులు గమ్యానికి చేర్చడానికి మూడు లేదా నాలుగు రోజుల సమయం పడుతుంటే ఆర్టీసీ కేవలం 24 నుంచి 48 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు చేరుస్తున్నాయి.

కొరియర్ సేవల్లో దూకుడు

ఆర్టీసీ కొరియర్ సేవలకు ఆదరణ లభిస్తోంది.పార్శిల్ కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల బరువు వరకు వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు వస్తువులను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇళ్లు మారాలనుకునే సామగ్రి తరలింపునకు కూడా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఇలా సరుకు రవాణా ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

ఏటీబీ ఏజెంట్ల సంఖ్య పెంపు

ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణతో ఆథరైజ్డ్ టిక్కెట్ బుకింగ్ (ఏటీబీ) ఏజెంట్ల వ్యవస్థను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతానికి ఈ జోన్‌లో 175 మంది ఏటీబీ ఏజెంట్లు ఉన్నారు. ఈ సంఖ్యను దాదాపు 400 వరకుపెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. వీరికి బుకింగ్ చార్జీలు 15 శాతం కమిషన్‌గా చెల్లిస్తున్నారు. ఏటీబీ కోసం గ్రామీణ ప్రాంతంలో రూ. 1000, అర్బన్‌లో రూ. 5000 చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

రూ. 10 కోట్ల ఆదాయం

కార్గో రవాణాలో జోన్-4లో 2021-22 సంవత్సరంలో రూ. 25,04,90,000, 2022-23లో రూ. 35,21,80,000 ఆదాయాన్ని సాధించింది. గత ఏడాదితో పోలిస్తే ఈఏడాది రూ. 10 కోట్ల మేర అదనపు ఆదాయం చేకూరింది.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ కార్గో రవాణాకు ఆదరణ లభిస్తోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. సకాలంలో వస్తువులను చేర్చి ప్రజల అభిమానాన్ని పొందేడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రైవేటు కార్గో సేవలతో పోలిస్తే ఆర్టీసీ కార్గో తక్కువ ఖర్చుతో సరుకులను రవాణా చేస్తోంది. ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– గోపినాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కడప

108లో ప్రసవం

– తల్లీబిడ్డ క్షేమం



పురిటి బిడ్డ, తల్లితో 108 ఈఎంటీ దస్తగిరి

కమలాపురం : ఓ నిండు గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో 108 వాహనంలో ప్రసవం జరిగింది. వివరాలు..కమలాపురం 108 ఈఎంటీ దస్తగిరి కథనం మేరకు.. ఖాజీపేట మండలం మిడుతూరు గ్రామానికి చెందిన గర్భిణి శ్రావణికి పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. సిబ్బంది వెళ్లి కమలాపురం ఆసుపత్రికి తీసుకొస్తుండగా పాగేరు వంక వద్దకు రాగానే ఆమెకు నొప్పులు అధికమయ్యాయి.దీంతో వాహనంలోనే ప్రసవం జరిగింది. శ్రావణి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని దస్తగిరి తెలిపారు. అనంతరం వారిని కమలాపురం ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించామన్నారు. కాగా శ్రావణి భర్త ప్రశాంత్ కుమార్ ఈఎంటీ దస్తగిరి, పైలట్ సునీల్, 108 సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలకు మంచి రోజులు

రూ.66 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాచమల్లు



వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఇన్నాళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్న వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి ఆఫ్ యోగివేమన యూనివర్సిటీకి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వంలోనే మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. రూ.66 కోట్లతో కళాశాల అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రొద్దుటూరు ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని 2008లో వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేశారన్నారు. నాడు ఈ కళాశాల అభివృద్ధిని టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ కారణంగానే ఎస్‌కేఎస్‌సీ డిగ్రీకళాశాలలో అద్దె భవనాల్లో నడుపుతున్నారన్నారు. అలాగే విద్యార్థులు ల్యాబ్‌ల కోసం పక్కనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ వచ్చాక కళాశాల సమస్యపై దృష్టి సారించి నిధులు మంజూరు చేయించామన్నారు.

కళాశాలలో మౌలిక వసతుల ఏర్పాటు

వైఎస్సార్ ఇంజినీరింగ్‌కళాశాల అభివృద్ధికి మొత్తం రూ.165 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. తొలి విడతలో రూ.66 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో సివిల్, ఈసీఈ డిపార్ట్‌మెంట్లతోపాటు లైబ్రరీ, బాలుర, బాలికల హాస్టళ్లను, రోడ్లను, డ్రైనేజి కాలువలను నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, వార్డు కౌన్సిలర్ జయంతి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిసెట్టి బాబు, నియోజకవర్గ అధ్యక్షురాలు గజ్జల కళావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరు నాగేంద్రారెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, కాకర్ల నాగేశ్వారెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, కొత్తపల్లె, గోపవరం సర్పంచ్‌లు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, గద్దా మోషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్టాఫ్‌నర్స్ నియామకాల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ కోటేశ్వరి

కడప రూరల్ : వైఎస్సార్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామకం, పోస్టింగ్ ప్రదేశాల కేటాయింపుల కౌన్సెలింగ్ ముగిసింది. బుధవారం జోన్-4 పరిధిలోని రాయలసీమ జిల్లాలకు చెందిన 137 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) డాక్టర్ కోటేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం, మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్స్ రఘు, అల్లావుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను పరిమితి పెంచాలి



సాఫ్ట్‌వేర్‌ను విడుదల చేస్తున్న పోచంరెడ్డి సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, పీఎస్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు సంబంధించి వ్యక్తిగత ఆదాయపన్ను పరిధిని రూ. 5లక్షలకు, పొదుపులను రూ.3 లక్షలకు పెంచాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి , పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం(పీఎస్‌టీయూ) ఆధ్వర్యంలో తయారు చేసిన ఆదాయపుపన్ను సాఫ్ట్‌వేర్‌ను ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి మునిరెడ్డి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దాదాపు ఎనిమిదేళ్లుగా ప్రవేశపెట్టిన ఏ బడ్జెట్‌లోనూ వ్యక్తిగత ఆదాయపన్ను పరిధిని పెంచిన దాఖలాలు లేవన్నారు. ప్రతి సంవత్సరం జిమ్మిక్కు చేస్తోందన్నారు.ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిధిని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయులు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జక్రియ, వైఎస్సార్‌జిల్లా ప్రధాన కార్యదర్శి రామలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్యకు యత్నం

– మైలవరం జలాశయంలో దూకేందుకు వెళ్లిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



పుల్లయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

జమ్మలమడుగు : ఆత్మహత్య మహా పాపం..! కానీ ఈ సమాజంలో చిన్న చిన్న కారణాలకే చాలా మంది ప్రాణాలు తీసుకుంటున్నారు. ఒత్తిడిలో చిత్తవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన మంగలి పుల్లయ్య ఆత్మహత్యకు యత్నించాడు. మైలవరం జలాశయంలో దూకడానికి వెళ్లాడు. పోలీసులు అప్రమత్తమై అతన్ని కాపాడారు.కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. జమ్మలమడుగు పట్టణంలోని ఎస్పీజీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న మంగలి పుల్లయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం దాదాపు మూడులక్షలకు పైగా ఖర్చు అయింది.అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్యకు చేసుకోవటానికి వెళ్లాడు. జలాశయం కట్టపైన తిరుగుతుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి ఎస్ఐ రామకృష్ణకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంటనే పోలీసులతో మైలవరం అక్కడికి వెళ్లి పుల్లయ్యను స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం భార్య పుష్పలతకు అతన్ని అప్పగించారు.

కారుకు నిప్పు



కాలిపోయిన కారు

వేంపల్లె : స్థానిక పప్పుల బజార్‌లో బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు కారుకు నిప్పు పెట్టారు. కారు పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.4లక్షల మేర నష్టం జరిగిందని బాధితుడు హుస్సేన్ తెలిపారు. నిన్న స్కూటర్, ఈ రోజు కారుకు నిప్పు పెట్టడంతో ప్రజలు ఇంటి బయట వాహనాలు పెట్టాలంటే భయపడుతున్నారు. హుస్సేన్ ఫిర్యాదు మేరకు వేంపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు.ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో అపశృతి

– బాణాసంచా నిప్పు రవ్వలు పడి గడ్డివాములు దగ్ధం

ప్రొద్దుటూరు క్రైం : ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. టీడీపీ నాయకుల రాకను పురస్కరించుకొని బాణాసంచా కాల్చగా వాటి నిప్పు రవ్వలు ఎగిసి పడి పక్కనే ఉన్న గడ్డివాములు దగ్ధం అయ్యాయి. ప్రొద్దుటూరులోని పొట్టిపాడు రోడ్డు సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించే కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడికి టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇతర నాయకుల రాకను పురస్కరించుకొని టీడీపీ కార్యకర్తలు బాణాసంచా పేల్చారు. నిప్పు రవ్వలు ఎగిసి పడటంతో పక్కనే ఉన్న నాగేశ్వరరెడ్డికి చెందిన రెండు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే వాములు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 2 లక్షలు దాకా నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బాధితుడికి లక్షరూపాయలు అందజేశారు.

జాతీయస్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీల్లో రాణించాలి



ఏపీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : జాతీయస్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు రాణించాలని ఏపీ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గిరిధర్‌రెడ్డి కోరారు. బుధవారం కడప నగరం ఎన్‌జీఓ కాలనీలోని విజయాస్ ఆర్చరీ అకాడమీలో ఫీల్డ్ ఆర్చరీ రాష్ట్రస్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఎంపికలకు 7 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఏపీ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వర్రి చెన్నకేశవులు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 12, 13వ జాతీయస్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 29 మంది క్రీడాకారులను ఏపీ జట్టుకు ఎంపికచేసినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు రవిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- చెట్టు ఢీకొన్న కారు
- ఇద్దరు యువకుల మృతి



నుజ్జునుజ్జయిన కారు





సిద్దేశ్వర్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి మృతదేహాలు

ఓబులవారిపల్లె : మండలంలోని యాల్లాయపల్లె పంచాయతీ అప్పగుంటపల్లె గ్రామం సమీపంలో చెట్టును కారు ఢీకొనడంతో దినేష్‌కుమార్‌రెడ్డి అలియాస్ సిద్దేశ్వర్‌రెడ్డి(26),తేజేశ్వర్‌రెడ్డి(26) అక్కడికి అక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పెద్దఓరంపాడు గ్రామనికి చేదిన ముద్దా సుధాకర్ రెడ్డి ఒక్కగానొక్క కుమారుడు సిద్దేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లో షార్ట్‌ఫిలిమ్ డైరెక్టర్‌గా చేస్తున్నాడు. నందలూరు గ్రామానికి చేందిన కసిరెడ్డి బలరామిరెడ్డి కుమారుడు తేజేశ్వర్‌రెడ్డి ప్రవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు తేజేశ్వరరెడ్డి అమ్మమ్మ గారి ఊరు పెద్దఓరంపాడు గ్రామానికి వచ్చాడు. వీరు మరో ముగ్గురు స్నేహితులు కరీముల్లా,సాయి,భువనేశ్వర్‌రెడ్డితో కలిసి కొర్లకుంట నుంచి పెద్దఓరంపాడుకు కారులో బుధవారం బయలుదేరారు. యల్లాయపల్లె గ్రామం దాటిన తర్వాత అప్పగుంటపల్లె సమీపంలో అదుపుతప్పి అతివేగంగా చెట్టును ఢీకొన్నారు. ప్రమాదంలో సిద్దేశ్వర్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి గాయపడిన వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షేక్ కరీముల్లా,సాయి ఇద్దరికి తీవ్రగాయాలు కాగా భువనేశ్వరెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. సిద్దేశ్వర్‌రెడ్డి, తేజేశ్వరెడ్డిలు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. పెద్దఓరంపాడు గ్రామంలో విషాయదఛాయలు అలముకున్నాయి. మృతదేహాలకు పోస్టు మార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

హెల్మెట్, సీటు బెల్ట్ ధరించండి

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప అర్బన్ : హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్‌పై పత్రికాప్రకటన విడుదల చేశారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామ సభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలతో పాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు, జీపులు నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్ట్ వేసుకోవాలని ఎస్పీ సూచించారు. వేగ నియంత్రణ, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మొబైల్ మాట్లాడుకుంటూ డ్రైవ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓవర్‌లోడింగ్‌తో వెళ్లే ఆటోలపై కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు భద్రతపై స్టిక్కర్లు, పోస్టర్లు ముద్రించి పట్టణాలు, గ్రామాల్లో అతికిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 315 కేసులు

జిల్లాలో పోలీసులు బుధవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం కేసులు 315 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన చోదకులపై 267 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహన చోదకులు 48 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు.